క్లుప్తంగా

అడ్వాన్స్‌డ్‌లో సత్తాచాటిన 'కేఎల్‌ఎన్' విద్యార్థులు


రాకిన్


అక్షిత

మిర్యాలగూడ: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కళాశాల విద్యార్థి బెజవాడ రాకిన్ జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరీలో 1751ర్యాంకు, ఎం. అక్షిత 2,115వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, పీఎల్‌ఎన్ రెడ్డి, హన్మంతరెడ్డి అభినందించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జునసాగర్ డివిజన్ కార్యదర్శి కోరె రమేష్

పెద్దవూర: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించటంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ నాగార్జునసాగర్ డివిజన్ కార్యదర్శి కోరె రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్కో ఎంఈఓ మూడు నుంచి నాలుగు మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తూనే హెచ్‌ఎంలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని అన్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని అన్నారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, నాయకులు చందు, పవన్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

త్రిపురారం: మండలంలోని అంజనపల్లి గ్రామపంచాయతీకి చెందిన కలకొండ అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అశోక్‌తో పాటు త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 1999–2000వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న అతడి స్నేహితులు ఆదివారం అశోక్ కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. అనంతరం అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అవిరెండ్ల వీరయ్య, రేవూరి దశరథ, మడుపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగదు వసూళ్లపై ఎస్‌ఐకి ఫిర్యాదు

చింతపల్లి: ఆవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకొని విశ్వ హిందూ పరిషత్, బీజేపీ, భజరంగ్‌దళ్ పేరుతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్ ఆదివారం చింతపల్లి ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు



దేవరకొండ: స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో కేక్ కట్ చేస్తున్న ఎన్‌వీటీ

దేవరకొండ: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దేవరకొండ పట్టణంలో ఫాదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ కేక్ కట్ చేసి మాట్లాడారు. పిల్లలపై నాన్న ప్రేమ వెలకట్టలేనిదని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట వేయడంలో తండ్రి ఎంతగానో శ్రమిస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉమామహేశ్వర్, తాళ్ల శ్రీధర్‌గౌడ్, రాపోలు నిరంజన్, తాళ్ల సురేష్, భాస్కర్‌రెడ్డి, రమేష్, శ్రీను, ఖాజా, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మిర్యాలగూడ పట్టణంలో..

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని రైతు బజారు డైమండ్ బేకరీ వద్ద ఆదివారం వాసవి జస్టిస్ అడ్వకేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పాదచారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆర్‌సీ మాశెట్టి శ్రీనివాస్–గీత, ఐపీసీ మిట్టపల్లి విజయభాస్కర్‌రావు, జెర్సీ సామా శ్రీనివాస్–వనిత, వందనం అధ్యక్షులు సామ సంతోషి, అడ్వకేట్స్ క్లబ్ కార్యదర్శి పారేపల్లి మాధవి–శ్రీనివాస్, ఏచూరి మురహరి–భాగ్యలక్ష్మి దంపతులతో పాటు పలువురు క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' దేశానికే ఆదర్శం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్
- ఊరూరా ఘనంగా మంచినీళ్ల పండుగ

పెద్దఅడిశర్లపల్లి: రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదండాపురం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నిర్వహించిన తెలంగాణ మంచినీళ్ల పండుగలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డితో కలిసి ఆయన ఎమ్మెల్యే మాట్లాడారు. మిషన్ భగీరథ పథకం ద్వారా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు అందుతుందని అన్నారు. సమైక్య రాష్ట్రంలో తాగునీటి సమస్యలతో దశాబ్దాల పాటు ఇబ్బందులు పడ్డ ప్రజలకు స్వరాష్ట్రంలో మిషన్ భగీరథతో సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. మిషన్ భగీరథతో నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్, ఆర్డీఓ గోపీరాంనాయక్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, ఏడుకొండల్ యాదవ్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులున్నారు.

నీళ్ల గోస తీరింది..

గుర్రంపోడు: మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకు వద్ద ఆదివారం నిర్వహించిన తెలంగాణ మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ పథకంతో మహిళలు బిందెలు పట్టుకుని కుళాయిల వద్ద నీళ్ల కోసం పడిగాపులు పడే గోస తీరిందని అన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీధనుంజయ, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, గ్రామ సర్పంచ్ మల్రి అనిత, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. పాశం వారిగూడెంలో సర్పంచ్ పాశం అలివేలమ్మ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగను నిర్వహించారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండలంలోని బంగారికుంట తండాలో ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు బిందెల్లో మిషన్ భగీరథ నీటితో వాటర్ ట్యాంకు నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ కాంతి కృష్ణకాంత్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి రవి, స్థానికులు రంగా, అంజి, హతీరాం తదితరులున్నారు.


పెద్దఅడిశర్లపల్లి: మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో ఆదివారం మంచినీళ్ల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రాజు, ఏఓ రామలింగేశ్వర్‌రావు, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేములపల్లిలో..

వేములపల్లి: మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మిషన్ భగీరథ సిబ్బందిని సన్మానించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిని అందించి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ రక్కసి నుంచి ప్రజలను రక్షించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వీఆర్‌ఏ బొజ్జ సైదులు, ఉప సర్పంచ్ చెన్నబోయిన వెంకటనారాయణ, లక్ష్మమ్మ, పేరాల రమేష్, ఉపేంద్ర, నాగయ్య, భుజంగరావు, లింగాచారి, సైదులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లిలో...

మాడుగులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తోందని ఎంపీఓ రవికుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. పూసలపహాడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీఓ పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్లలో సాధించిన జల ప్రగతి సమాచారంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేయాలన్న ఉద్దేశంతోనే మిషన్ భగీరథ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపూరు నిర్మల, నిడమనూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖాసీం, పంచాయతీ కార్యదర్శి సునీత, ఆశావర్కర్ విక్టోరియా, వీబీకే సుజాత, బొల్లంపల్లి సరిత పాల్గొన్నారు.


గుర్రంపోడు: జిన్నాయిచింతలో పాల్గొన్న ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


వేములపల్లి: గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి


మాడుగులపల్లి: పూసలపహాడ్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ రవికుమార్ తదితరులు

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగను నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని అన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, కోట్ల సతీష్, ప్రవీణ్, లక్ష్మణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి: మంచినీళ్ల పండుగలో పాల్గొన్న మిషన్ భగీరథ అధికారులు, ప్రజాప్రతినిధులు


చింతపల్లి: కుర్మేడులో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, ప్రజాప్రతినిధులు


అడవిదేవులపల్లి: బంగారికుంటతండాలో మంచినీళ్ల పండుగలో పాల్గొన్న గిరిజనులు

ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జోనల్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్యకర్తలు గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మంగళవారం మిర్యాలగూడలోని సాగర్‌రోడ్డులో గల వైష్ణవి గ్రాండ్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు జగదీష్‌చంద్ర, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశురాములు, మంగారెడ్డి, వినోద్ నాయక్, రామ్మూర్తి, సైదులు, రొండి శ్రీనివాస్, పాపానాయక్, బాబునాయక్, వేణుధర్‌రెడ్డి, శంకర్ నాయక్ తదితరులున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి..

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం అమ్ముకున్న రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 11లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. ధరణిలో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. సాగర్ ఎడమకాల్వ మేజర్ల పరిధిలో లైనింగ్ పనులు మధ్యమధ్యలో వదిలివేశారని, వానాకాలం ప్రారంభం కాకముందే సీసీ లైనింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. లిఫ్టులకు మరమ్మతులు చేపట్టి ప్రభుత్వమే పూర్తి నిర్వహణ బాధ్యత తీసుకోవాలన్నారు. అయూబ్, కె. రమేష్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి

మిర్యాలగూడ అర్బన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, జిల్లాలోని అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కొర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలోని 31మండలాలకు కేవలం 9మంది ఎంఈఓలు మాత్రమే ఉన్నారని, ఒక్కో ఎంఈఓ నాలుగు మండలాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తుండడంతో పాటు డీఈఓలు కూడా లేకపోవడంతో విద్యారంగ సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు, రెగ్యులర్ ఎంఈఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వదూద్, జగన్, శివ, ముని తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కలల్‌వాడలో జిల్లా సాధన సమితి, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యువకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నేత బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాకు సరిపడా వనరులు ఉన్నప్పటికీ మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు జిల్లా ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జిల్లాను సాధించేంత వరకు ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో అనిల్, అశోక్, రంగా, శివ, గౌతమ్, రవితేజ, ప్రసన్న, యూసుఫ్, శ్యామ్, సత్య, ప్రవీణ్, సాయి, మహేష్, సన్నీ, ఈశ్వర్ తదితరులున్నారు.


ధర్నా చేస్తున్న యువకులు

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం హాలియా పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మోర్చాల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 9ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ మోర్చాల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మోర్చాలు పనిచేయాలన్నారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎన్‌ఆర్‌ఐ కొంపెల్లి శ్రీనివాస్‌ను పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ పానుగోతు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉయ్యాలవాడ నరసింహులు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ చలమల వెంకట్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.


బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నేతలు

పశువుల సంత వేలం నిర్వహించాలని ధర్నా

- సంతలో అక్రమ వసూళ్లపై స్థానిక యువత నిలదీత
- 2015 నుంచి పాత కాంట్రాక్టర్‌రే కొనసాగింపు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పశువుల సంత నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించాలంటూ ఆదివారం స్థానిక యువత ధర్నాకు దిగారు. బహిరంగ వేలం నిర్వహించాలని కోరుతూ బోడ అశోక్‌యాదవ్ అనే వ్యక్తి మూడు నెలల నుంచి కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓలకు వినతిపత్రాలు ఇస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో పాటు సంతలో అక్రమ వసూళ్లను నిరసిస్తూ పలువురు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల సంతను 2015 నుంచి పాత కాంట్రాక్టర్‌కే స్థానిక పాలకవర్గం, ఈఓ అప్పజెబుతూ వస్తున్నారని ఆరోపించారు. ముడుపులు పుచ్చుకొని బహిరంగ వేలం నిర్వహించకుండా పాత కాంట్రాక్టర్‌కే కట్టబెట్టడం దారుణమని ఆరోపించారు. సదరు గుత్తేదారు గ్రామపంచాయతీ స్టాంపు, ముద్ర లేకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సంతలో నిర్వహించే ప్రతి షాపు నుంచి తైబజారు వసూలు చేస్తున్నాడని, అంతేకాకుండా సంతలో ఒక మేక, గొర్రెకు రూ.100 వసూలు చేయాల్సి ఉండగా రూ.150 వరకు వసూలు చేస్తున్నాడని అన్నారు. సంత కాంట్రాక్టర్ స్థానిక ఎంపీటీసీకి రూ.3లక్షలు ఇచ్చినట్లు ఆరోపించారు. ఇదిలా ఉంటే ఇటీవల కొండమల్లేపల్లి పట్టణంలో బొడ్రాయి పండుగ జరగగా, సంత కాంట్రాక్టర్ సుమారు 80 మేకలను స్థానిక నాయకులకు, కొంతమంది పాలకవర్గానికి కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సంత నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోడ అశోక్ యాదవ్, బూడిద మల్లేశ్‌యాదవ్, నరసింహాచారి, మురళీ, రమేష్, శ్రీనివాస్, రవి, లింగం తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న యువకులు


సంత కాంట్రాక్టర్‌ను నిలదీస్తున్న యువత

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాగార్జునసాగర్: పెద్దవూర మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యానికేతన్‌లో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం నాగార్జునసాగర్‌లోని విజయ విహార్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు వడ్డపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఏ. శ్రీనివాసాచారి, కర్ణ సైదిరెడ్డి, సలికంటి వెంకటయ్య, దేవేందర్, అశోక్, నాగేశ్వర్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాతన బోయిన గోపి, శోభ, లక్ష్మయ్య, ప్రకాశ్, సతీష్, బూర శ్రీను, సంతోషి, వనజ, సుభాషిని, వెంకన్న, సరస్వతి, సుధీర్, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని నవజ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో న్యూరోఫిజిషియన్ డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ, డాక్టర్ కోమలి 220 మందికి వైద్య పరీక్షలు చేశారు. దాతలు మేడ సురేందర్‌రెడ్డి, గార్లపాటి పండిట్‌రెడ్డి సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంపాటి అమరయ్య, జేవీవీ ప్రతినిధులు చార్లెస్, బక్కా శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడికి యత్నం

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదివారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్యాంపు కార్యాలయం సమీపంలో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో గోపిచంద్, కొత్త అఖిల్ గోపి, రాకేష్, ఈశ్వర్, మహేష్, హేమసుందర్ తదితరులున్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చు

మిర్యాలగూడ టౌన్: ప్రతి క్రీడాకారుడిలో కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని భారత అండర్–19 క్రికెట్ టీం వైస్ కెప్టెన్ షేక్ రషీద్ అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఆదివారం ఆయన పరిచయం చేసుకొని తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి ఎదిగేందుకు ఎంతో కష్టపడ్డానని, తన కుటుంబ సభ్యులు కూడా ఎంతో ప్రోత్సహించారని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా కప్పు ఎలా సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం రషీద్‌తో పాటు ఆయన తండ్రి బాలిషావలిని క్లియో స్పోర్ట్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లియో స్పోర్ట్స్ స్టేడియం అధినేత ఏచూరి హర్ష, కోచ్‌లు మారబోయిన రామకృష్ణ, కావలి వెంకన్న, క్రీడాకారులు తదితరులున్నారు.


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న భారత అండర్–19 క్రికెట్ టీం వైస్ కెప్టెన్ రషీద్

బస్టాండ్‌లో అన్నదానం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం వాసవి వనిత క్లబ్, వాసవి క్లబ్ కుసుమాంబ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరంగా సరిత–హరినాథ్, అప్పన సునీత–రమేష్, వీరవల్లి శ్రీదేవి–జనార్దన్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమావాస్య రోజు అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ రాయపూడి భవాని, జోనల్ చైర్‌పర్సన్లు భువనగిరి లావణ్య, తిరునగరు పద్మావతి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ మిర్యాల నాగమణి, వాసవి వనిత క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె. రమాదేవి, జి. లక్ష్మి, కోశాధికారి పి. ఉషాబాల, వాసవి క్లబ్ కుసుమాంబ అధ్యక్షురాలు జి. అనిత, సభ్యులు కొండూరు ఇందిరా, రోజారాణి తదితరులున్నారు.

బీసీ గురుకుల విద్యార్థికి ఉత్తమ ర్యాంకు


గణేష్

నాగార్జునసాగర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల కళాశాల విద్యార్థి ఎం. గణేష్ ఎస్టీ కేటగిరీలో జాతీయస్థాయిలో 1364వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

తిరుమలగిరి(సాగర్): మండలంలోని బట్టువెంకన్న బావి తండాకు చెందిన 20 కుటుంబాలు బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆంగోతు రామునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి జానారెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జానారెడ్డి నివాళి..

హాలియా: అనుముల మండలంలోని పులిమామిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొట్టె మల్లయ్యయాదవ్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పులిమామిడి గ్రామానికి వెళ్లి మల్లయ్యయాదవ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైస్ ఎంపీపీ మాలే అరుణాసత్యనారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు యాదవ్, గ్రామ అధ్యక్షుడు జానారెడ్డి ఉన్నారు.


తిరుమలగిరి: మాజీ మంత్రి జానారెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు